క్లుప్తంగా

త్వరలోనే రైతు బంధు

దమ్మపేట: రైతు బంధు పథకం ద్వారా ఈ నెల 26వ తేదీ నుంచి ఎకరాకు రూ.5000ల చొప్పు న రైతుల ఖాతాల్లో జమ అవుతాయని జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత క్లస్టర్ వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో చేయూత

బూర్గంపాడు: వివిధ కారణాలతో ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక చేయూతనందిస్తున్నామని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. సారపాకలో మంగళవారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి ఆర్థికభారం కాకుండా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయమందుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు,బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మండల ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రహ్మణ్యం, మండల నాయకులు పాల్గొన్నారు.

కాటన్ బ్యాగులు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ప్రతి మంగళవారం కొత్త మార్కెట్‌లో నిర్వహించే వారపు సంతలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం కాటన్ బ్యాగులను వినియోగదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంబటి మణికంఠ మాట్లాడుతూ.. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదేశాల మేరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో సంతకు వచ్చే పట్టణ వాసులకు కాటన్ బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, సాగర్, ప్రశాంత్, అరవింద్, విష్ణు, సంతోష్, రాము, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

యాచకుడి మృతదేహానికి దహన సంస్కారాలు

అశ్వాపురం: మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలో భిక్షాటన చేస్తూ వడదెబ్బతో మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సీతరాంపురం గ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ నెల 16న సీతరాంపురం గ్రామంలో జెడ్పీ స్కూల్ వద్ద చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహాన్ని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని పోలీసులు సూచించి ఐదు రోజులు గడువిచ్చినా ఎవరు రాలేదు. దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసుల సూచన మేరకు సర్పంచ్ చాప ఉమాదేవి ఆధ్వర్యంలో పంచాయతీ ట్రాక్టర్‌లో తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

ములకలపల్లి: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగ కిషోర్ మాట్లాడుతూ.. రైతు సమస్యల పరిష్కారంపై పాలక పక్షాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ వీరభద్రానికి వినతిపత్రం అందజేశారు.

సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

అశ్వాపురం: విద్యా సంవత్సరం ప్రారంభమైనందున చదువుకునే విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ ఎంఏ.రాజుకు వినతిపత్రం అందజేశారు. కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల విషయంలో బీసీలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సర్టిఫికెట్లు త్వరితగతిన మంజూరు చేయాలని తహసీల్దార్‌కు వారు విన్నవించారు.

వీరాచారి మృతికి నివాళి

అశ్వాపురం: ఐటీసీ పీఎస్‌పీడీతో ఎస్ఆర్‌బీ మెకానికల్ విభాగంలో పని చేస్తున్న మండల కేంద్రానికి చెందిన బీఆర్‌టీయూ నాయకుడు కల్వచర్ల శ్రీనివాస్ తండ్రి వీరాచారి మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. వీరాచారి మృతదేహానికి కనీస వేతనాల రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఐటీసీ శ్రామికశక్తి ఎంప్లాయిస్ అండ్ బదిలీస్ యూనియన్ అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి నివాళులు అర్పించారు. మృతుడు వీరాచారి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పలువురు ప్రజాప్రతినిధులు, పలువురు నాయకులు ఉన్నారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవాన్ని నియోజకవర్గాల్లో పలు చోట్ల నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలకు చేరుకుని జెండా ఆవిష్కరణ చేశారు. విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు. విద్యాశాఖ ద్వారా పంపించిన బ్రోచర్లు, ఐఎల్‌పీ మోడల్స్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి, మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రూపురేఖలను మారుస్తున్నామన్నారు. – సాక్షి నెట్‌వర్క్


దుమ్ముగూడెం: మహాదేవపురంలోని ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు


బూర్గంపాడు: అంజనాపురంలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ రేగా తదితరులు


ములకలపల్లి: విద్యార్థులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు


బూర్గంపాడు: గాంధీనగర్‌లో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత


మణుగూరురూరల్: విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నరసింహారావు


భద్రాచలంటౌన్: దాతను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలు


అశ్వారావుపేటరూరల్: దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు


కరకగూడెం: ప్రజాప్రతినిధులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు


చంద్రుగొండ: విద్యాదినోత్సవం సందర్భంగా విద్యార్థినుల కళాప్రదర్శన


మణుగూరురూరల్: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు?


సమావేశంలో మాట్లాడుతున్న చంటి, సమ్మయ్య

దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్రం ఏం సాధించిందని గత రెండు వారాలుగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ డివిజన్ నాయకుడు కనితి సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడి చంటి విమర్శించారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మండలంలో ఒక్క గ్రామానికి కూడా సక్రమంగా మిషన్ భగీరథ నీళ్లు అందిస్తున్నారా? అని ప్రశ్నించారు. మండలంలో 100శాతం పైప్‌లైన్ నిర్మాణం కూడా ఇంకా పూర్తవ్వలేదని విమర్శించారు. రైతులకు గిట్టు బాటు ధర లేదని, రుణమాఫీ చేయలేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన లేదని, నిరుద్యోగ భృతి మరిచారని, కేజీ టూ పీజీ ఉచిత విద్యను మరిచిపోయారని విమర్శించారు. రేషన్‌కార్డు లేక ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇన్ని సమస్యలు ఉంచుకుని మీరు ఉత్సవాలు ఎలా జరుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కొర్సా రాఘవ, మడకం ఇర్మయ్య, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

అన్నపురెడ్డిపల్లి: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధనకు ఈ నెల 27వ తారీకు పాల్వంచలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు పోలికపోగు వెంకటేశ్వరరావు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం చలో పాల్వంచ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాల అభివృద్ధి ఎస్సీ వర్గీకరణతోనే సాధ్యం అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ యువతి పోరాటం చేయాలని కోరారు. సభకు మాదిగలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇనపనూరి రాంబాబు, బొబ్బి నాగేశ్వరరావు, పింగిలి మంగయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

చర్ల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేయడంపై చర్లలో మంగళవారం జూనియర్ కళాశాల లెక్చరర్లు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లెక్చరర్ల సంఘం నాయకులు వెంకన్న మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జూనియర్ లెక్చరర్లు రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న లెక్చరర్లు

సాయిబాబా విగ్రహం అందజేత

దమ్మపేట: ఆళ్లపల్లి మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సాయిబాబా విగ్రహాన్ని బహూకరించారు. మంగళవారం ఆళ్లపల్లి, ఇల్లెందు మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, తుమ్మల అనుచరులు, దమ్మపేట మండలంలోని గండుగుపల్లి గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లపల్లి మండలానికి చెందిన తుమ్మల ప్రధాన అనుచరుడు మహమ్మద్ అతహర్, తుమ్మలకు చెక్కతో చేయించిన సాయిబాబా విగ్రహాన్ని బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కనగాల పేరయ్య, గొరెశెట్టి సత్యనారాయణ, నల్లమాసు రాజన్న, ప్రభునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు ఘన సన్మానం


జీఎం(ఓసీపీ) గోపాలకృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఏరియా జీఎం రాంచందర్

మణుగూరురూరల్: సింగరేణిలో సుదీర్ఘకాలం పని చేసి పదవి విరమణ చేయబోతున్న జీఎం(ఓసీపీ) వై.గోపాలకృష్ణమూర్తిని మణుగూరు ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా జీఎం రాంచందర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో బదిలీలు, పదోన్నతులు, పదవి విరమణలు సర్వసాధారణమన్నారు. గోపాలకృష్ణమూర్తి సింగరేణిలో ఉద్యోగిగా, అధికారిగా పని చేస్తూ.. అందరి మనసులో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని అన్నారు. తన మేధాసంపత్తితో అనేక ఓపెన్ కాస్ట్ గనుల్లో కొత్త యంత్రాలను, పరికరాలను ఆవిష్కరించి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఏజెంట్(కేపీయూజీ) జి.నాగేశ్వరరావు, ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ప్రాజెక్ట్ అధికారులు లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, డిజీఎంలు ఎస్ రమేష్, శ్రీనివాసమూర్తి, మదన్ నాయక్, ప్రాజెక్ట్ ఇంజనీర్లు వీరభద్రుడు, రవీందర్, సెక్యూరిటి అధికారి షబ్బీరుద్దీన్, సీనియర్ ఎస్టేట్ అధికారి బాబుల్ రాజ్, సీనియర్ అకౌంట్స్ అధికారి సంధ్యారాణి, ఐటి మేనేజర్ సాయిల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణం ఇంకెప్పుడు?


మొండికుంట ప్రధాన రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా కోటి రూపాయలతో నిర్మించనున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు మోక్షం కలగడం లేదు. గత ఏడాది డిసెంబర్ 5న మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే రేగా డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల మే 26న ఆర్అండ్‌బీ అధికారులు డ్రెయినేజీ నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ ఇచ్చారు. మార్కింగ్ వరకు ఉన్న షెడ్లు, నిర్మాణాలు తొలగించాలని స్థానికులకు సూచించారు. స్థానికులు అధికారులు ఇచ్చిన మార్కింగ్ వరకు తొలగించారు. మే 30న స్థానిక సర్పంచ్ మర్రి మల్లారెడ్డి డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. కానీ డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించలేదు. భారీ వర్షాలు కురిస్తే నిర్మాణ పనులు సాధ్యపడవు. ఇప్పుడే పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తే స్థానికులకు వర్షాకాలంలో డ్రెయినేజీ సమస్య తీరుతుంది. లేకపోతే స్థానికులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడతారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యం పాలవుతున్న కాలనీ వాసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీ, జగదీష్ కాలనీలకు చెందిన ప్రజలు నిత్యం ఆరోగ్యానికి పాలవుతున్నారు. ఆయా కాలనీల్లో ప్రజలు నిత్యం వాంతులు, విరోచనాలు, జ్వరంతో బాధపడుతున్నారు. ఇప్పటికే సుమారు 10 కుటుంబాలకు సంబంధించిన వారు ఆస్పత్రి పాలయ్యారని, భద్రాచలంలో సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొందని సదరు కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ కాలనీల్లో ఉన్న డ్రెయినేజీ, తాగునీరు తదితర అంశాలపై అధికారులు పూర్తి స్థాయిలో చర్యలో తీసుకోకపోవడం వల్లే వ్యాధులు ప్రబలుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి సర్వే నిర్వహించి కారణాలను వెలికితీయాలని స్థానికులు కోరారు. అయితే, విషయం తెలుసుకున్న సంబంధింత అధికారులు అక్కడికి చేరుకుని పరీక్ష కోసం వాటర్ శాంపిల్‌ను తీసుకున్నారు. కాగా, రానున్నది వర్షాల కాలం కావడంతో ఈ సీజనల్ వ్యాధులు విస్తృతంగా ప్రబలే అవకాశం ఉందని, వైద్య ఆరోగ్య అధికారులు ప్రజలు రోగాల బారినపడకుండా కాపాడాలని ఆయా కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

దోమలమందు పిచికారీ


దమ్మపేట: పూసుకుంటలో దోమల మందు పిచికారీ చేయిస్తున్న ప్రభుత్వ వైద్యులు

మణుగూరురూరల్: మండల పరిధిలోని వలస ఆదివాసి గిరిజన గ్రామమైన విప్పలగుంపులో డీఎం అండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రతీ ఇంట్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు రాకుండా దోమల నివారణ కోసం దోమల మందు పిచికారీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి సావిత్రి, సీహెచ్‌ఓ వెంకటేశ్వరరావు, ఎస్‌యూఓ లింగ్యా నాయక్, ఎంటీఎస్ అరుణ్‌బాబు, రాంప్రసాద్, ఉమేష్, సుజాత, భవాని, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని గవర్నర్ దత్తత గ్రామమైన కొండరెడ్ల పూసుకుంట, కటుకూరు, గుత్తికోయల గుంపు గ్రామాల్లో మలేరియా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం దోమల మందును పిచికారీ చేశారు.

రాబోయే వర్షాకాలం దృష్ట్యా మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా, తొలివిడత దోమల మందును పిచికారీ చేయిస్తున్నామని మలేరియా వైద్యులు తెలిపారు. పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకుని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మలేరియా వైద్యురాలు సంధ్యారాణి, ఏఎంఓ గొంది వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ దివాకర్, సూపర్వైజర్ బషీరుద్దీన్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

బూర్గంపాడు: మోరంపల్లిబంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం పదో తరగతి చదివి మంచి గ్రేడ్‌లు సాధించిన ఐదుగురు విద్యార్థులకు స్థానిక నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలను అందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో మంచి గ్రేడ్‌లు సాధించిన పోలపల్లి గోపి, మల్లెబోయిన నాగలక్ష్మి, నక్కా సందీప్, బానోత్ కీర్తన, కారంపూడి సంతోష్‌లకు ఒక్కొక్కరికి రూ.2వేల నగదు ప్రోత్సాహకం, ప్రశంస పత్రాలను నేస్తం ట్రస్ట్ ప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, నేస్తం ట్రస్ట్ అధ్యక్షుడు బత్తుల రామకొండారెడ్డి, గ్రామపెద్దలు కైపు సుబ్బరావిరెడ్డి, చింతా అంకిరెడ్డి, కైపు రమేష్‌రెడ్డి,బత్తుల రామకొండారెడ్డి,సంకా సురేష్, బాలనారాయణరెడ్డి, ఆవుల నాగార్జున,హెచ్‌ఎమ్ కె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏజెన్సీని మరిచిన ఆర్టీసీ

- పక్కా రోడ్లు ఉన్నా బస్సు సర్వీసులు సున్నా
- ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్న జనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం


బస్సులు నడిచేందుకు అనువుగా ఉన్న కుర్నపల్లి రహదారి

చర్ల: అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు ఏజెన్సీ ప్రాంతాల్లో పలు చోట్ల బస్సులు నడిపేందుకు రహదార్లు అనువుగా ఉన్నప్పటికీ రవాణాశాఖ అధికారులు సర్వీసులను ఏర్పాటు చేయడం లేదు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు నిత్యం విన్నవిస్తూ వస్తున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. చర్ల మండల సరిహద్దున ఉన్న గిరిజన గ్రామాలకు ఏళ్ల తరబడిగా బస్సులు లేవు. గతంలో గ్రామాలకు రహదార్లు సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సులను నడిపేందుకు ఆసక్తిని చూపలేదు. అయితే ఆయా గ్రామాలకు గడిచిన ఐదారేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి రహదార్లను ఏర్పాటు చేశారు. ప్రతీ రహదారిలోనూ కనీసం 10 గ్రామాలు ఉండగా ఆ గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది వారి అవసరాలను తీర్చుకునేందుకు మండల, డివిజన్ కేంద్రాల వచ్చి పోతున్నారు.

'ప్రైవేటు' ప్రయాణంతో ప్రమాదాలు

గ్రామాల నుంచి తమ అవసరాలు తీర్చుకునేందుకు మైదాన ప్రాంతాలు, మండల, డివిజన్ జిల్లా కేంద్రాలకు జనం వెళ్లొస్తున్నారు. అందుకోసం బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలైన ఆటోలు ట్రాలీలు, బొలేరోలు, ట్రాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. వీటి ద్వారా రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొందరు క్షతగాత్రులవుతూ ఉంటే మరి కొందరు ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

చదువులకు దూరమవుతున్న విద్యార్థులు

రహదారులు ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంతాల నుంచి హైస్కూల్, కళాశాలల చదువులు సాగించే విద్యార్థుల పరిస్థితి దుర్భరంగా మారింది. కిలోమీటర్ల కొద్దీ విద్యార్థులు నడిచి రాకపోకలు సాగిస్తున్నారు. మరికొంతమంది సైకిళ్లపై వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో కొందరు విద్యార్థులు చదువులకు కూడా దూరమవుతున్నారు. మారుమూలన ఉన్న గ్రామాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు కూడా బస్సు సౌకర్యం లేకపోవడంతో అతికష్టం మీద వారి వారి స్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

బస్సు రావాల్సిన ప్రాంతాలు ఇవే..

చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెం నుంచి బోదనెల్లి, కుర్నపల్లి, పులిగుండాల గ్రామాల మీదుగా దుమ్ముగూడెం మండలంలోని సీతానగరం వరకు, కలివేరు నుంచి తిప్పాపురం మీదుగా బీజాపూర్ జిల్లాలోని పామేడు వరకు, చర్ల నుంచి ఉంజుపల్లి మీదుగా పూసుగుప్ప వరకు (ప్రస్తుతం ఈ మార్గంలో ఆదివారం ఉదయం సాయంత్రం వేళల్లో మాత్రమే బస్సు నడుస్తోంది), దండుపేట మొగళ్లపల్లి, జీపీపల్లి మీదుగా సీ కత్తిగూడెం వరకు బస్సులను నడిపేందుకు రహదార్లు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. కనీసం మినీ బస్సులనైనా నడిపినా ఆయా గ్రామాలలోని ప్రయాణ కష్టాలు కొంతమేర తీరుతాయి.

ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం..



బస్సుల కోసం ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్నాం. రోడ్లు లేని సందర్భంలో రోడ్లు లేవని బస్సులు నడపలేదు. కానీ ఇప్పుడు రోడ్డు ఉన్నప్పటికీ బస్సులు రాకపోతుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. రహదారి సౌకర్యం ఉన్న గ్రామాలన్నింటికీ బస్సులు నడపాలి.

– మడకం చందు, ఎర్రంపాడు, చర్ల మండలం

బస్సుల బాధలు తీరేదెన్నడు?



మాకు బస్సుల బాధలు తీరే దారి కనిపించడం లేదు. ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఎక్కి రాకపోకలు సాగిస్తున్నాం. ప్రమాదాల బారిన కూడా పడుతున్నాం. దీనికి తోడు ప్రయివేటు వాహనాల్లో ప్రయాణిస్తుండడంతో వారు అధికంగా వసలు చేసే చార్జీలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

– ఉంగయ్య, చెన్నాపురం, చర్ల మండలం